నేడు కడపలో 'ఏచూరి' సంస్మరణ సభ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి : మార్క్సిస్టు మేధావి, సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి సంస్మరణ సభ శుక్రవారం ఉదయం 10 గంటలకు కడప ప్రెస్ క్లబ్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వ హించనున్నారు. సీతారాం ఏచూరి జిల్లా ప్రజానీకానికి అందించిన సేవలను స్మరించుకునే ప్రయత్నం చేస్తోంది. సంస్మరణ సభ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సంస్మరణ సభకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. ఆయనతో పాటు కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, మాజీ ఎంపీలు సాయిప్రతాప్, తులసిరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రయ్య, మాజీ మంత్రి అహ్మదుల్లా, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త కందుల రాజమోహన్‌రెడ్డి, టిడిపి, వైసిపి, కాంగ్రెస్, జనసేన జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి, పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎన్.డి.విజయజ్యోతి, ఎస్.శ్రీనివాసులు హాజరుకానున్నారు. వారితో పాటు జిల్లాలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు, వైద్యులు, పట్టణ ప్రముఖులు, ప్రజాస్వామికవాదులు హాజరు కానున్నారు. పార్టీలకు అతీతంగా సంస్మరణ సభకు ప్రజలు, నాయకులు తరలిరావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, నగర కార్యదర్శి రామ్మోహన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్ పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని వైద్యులను కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఆస్పత్రికి చెందిన వైద్యులు, సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించారు. ఏఏ విభాగాలకు చెందిన వైద్యులు అక్కడ విధులు నిర్వహిస్తున్నారు, వైద్యులు సిబ్బంది కొరత ఏమైనా ఉందా అని ఆరా తీశారు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోజుకు ఎంతమంది పేషంట్లు వస్తారు, పీడియాటిక్ కేసులు ఎన్ని వస్తాయి, సాధారణంగా ఆసుపత్రికి ఎలాంటి కేసులు వస్తాయి, ఎలాంటి మందులు అందుబాటులో ఉన్నాయి, మందుల కొరత ఏమైనా ఉందా, సెంట్రల్ డిస్పెన్సరీకి మందుల కొరకు ఎప్పుడెప్పుడు ఇండెంట్ పెడతారు, ఇండెంట్ మేరకు మందులు వస్తున్నాయా లేదా, రాత్రివేళ విధుల్లో ఎంతమంది వైద్యులు సిబ్బంది ఉంటారు, ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ ఉందా, నెలసరి ఆసుపత్రికి వచ్చే డెలివరీ కేసులు ఎన్ని, తదితరాలలో ఆస్పత్రి మెడికల్ అధికారి వెంకట్రామయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మందుల స్టాక్ రిజిస్టర్ పరిశీలన చేశారు. రిజిస్టర్ సరిగా నిర్వహించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు రిజిస్టర్ను అప్డేట్ చేయాలని మెడికల్ అధికారిని, సిబ్బందినిఆదేశించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిని కలియతిరిగి ఆపరేషన్ థియేటర్, స్కానింగ్ గది, ఫ్యామిలీ ప్లానింగ్ వార్డులను, మంచాలు, బెడ్స్ పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సాధారణంగా ఒక పిహెచ్‌సిలోనే నెలకు 20 నుంచి 30 ప్రసవాలు జరుగుతుంటే, ఇక్కడి పిహెచ్‌సిలో కేవలం నెలకు ఏడు మాత్రమే ప్రసవాలు జరుగుతున్నాయి, ఇలాంటి వెనుకబడిన ప్రాంతంలో ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను మరింతగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించాం, ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ లేదని దృష్టికి వచ్చింది, ఇక్కడ అనస్థీషియా, గైనకాలజిస్ట్ ఉన్నారు కానీ వారి సేవలు సరిగా వినియోగించుకోవడం లేదని తెలిపారు. ఆసుపత్రికి కొత్తగా భవనం నిర్మిస్తున్నారని అందులో ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యాధికారి దృష్టికి తెచ్చారని, అది అందుబాటులోకి వచ్చేవరకు కూడా ఒక

ఆస్పత్రి వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

వారంలోగా ఇక్కడ ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఆసుపత్రి అభివృద్ధి నిధులు లేదా శాఖ నిధులు ఉపయోగించుకొవాలని లేదా తనకు ప్రతిపాదిస్తే నిధులు మంజూరు చేస్తానని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని సరిగా వినియోగించుకోవాలని సూచించారు. చికిత్స అందించిన ఇన్ పేషెంట్ల వివరాలను ఆరోగ్యశ్రీ కింద తప్పనిసరిగా ఎన్రోల్ చేయాలని తద్వారా ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా ఆసుపత్రికి వైద్య ఖర్చులు జమవుతాయని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీ : స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న టీచర్లు ఆయాలు ఎంతమంది, పిల్లలు ఎంతమంది, రోజువారి హాజరు, కేంద్రానికి వస్తున్న గుడ్ల సరఫరా తదితర అంశాలలో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పూర్తి చేయాలి : ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన, పిజిఆర్ఎస్ లో భూమి సమస్యలపై వచ్చిన దరఖాస్తులు, ఎస్ఎల్ఎ పరిధిలో ఉన్నవి ఎన్ని, వాటిలో సమస్య ఏమిటి, అందుకు తీసుకున్న చర్యలు తదితరాలపై వీఆర్వోలు మరియు సర్వేయర్లతో వివరాలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికై తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. మార్గదర్శకాల మేరకు వేగవంతంగా పరిశీలన పూర్తి చేయాలని కలెక్టర్ తహశీల్దార్, విఆర్‌ఒలను ఆదేశించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి : యుటిఎఫ్

ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పాఠశాల విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.హరిప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యా రంగంలో ఏకపక్షంగా అమలుచేస్తున్న సంస్కరణల వల్ల గతంలో నెలకొన్న సమస్యలకు తోడుగా కొత్త సమస్యలు సృష్టిస్తున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన విద్యా రంగంలో అనాలోచిత తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. అనేక సమస్యలకు కారణమైన జిఒ నెంబర్ 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించాలని కోరితే ఇంకా కొత్త ఆన్‌లైన్ పనుల భారం మోపడం సరికాదని తెలిపారు. సిలబస్, పరీక్షల విధానంలోని లోపాలను సవరించాలని కోరారు. పాఠశాలల నిర్వహణకు గ్రాంట్లు మంజూరు చేయాలని, నెలవారీ ఉద్యోగోన్నతులు కల్పించాలని, ప్లస్ టు పాఠశాలల్లో పిజిటి పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల నిర్వహించిన పనిసర్దుబాటు ప్రక్రియ వల్ల ఇంకా గందరగోళం నెలకొందన్నారు. 2023లో నిర్వహించిన పదవ తరగతి పరీక్షల రెమ్యునరేషన్, 2024లో కొన్ని సబ్జెక్టు ఉపాధ్యాయులకు జిల్లాలో చెల్లించలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో విద్యా రంగ సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డి.చెంగల్ రాజు, జిల్లా కార్యదర్శి పి.వెంకట సుబ్బయ్య, రాజంపేట మండల ప్రధాన కార్యదర్శి జి.నాగేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు 'ఆదర్శ' విద్యార్థుల దాతృత్వం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

విజయవాడలో బుడమేరు వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సహాయంగా ఎపి మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.11,260లను విరాళంగా అందజేయడం అభినందనీయమని, వారి దాతృత్వాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు నగదును అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తోచిన సాయాన్ని అందించడం గొప్ప విషయమని, వారి దాతృత్వాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు నగదును అందజేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వరద బాధితులకు రూ.22 వేలు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఆర్.సురేష్, కరాటే చిన్నారుల చేతుల మీదుగా రూ.22,250 డిడిని ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు అందజేశారు. చిన్నారులు దాచుకున్న పాకెట్ మనీ విజయవాడ వరదలతో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవడానికి ముందుకు రావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రశంసించారు. విద్యార్థులు కరాటేలో, చదువుల్లో ముందు వుండటంతో పాటు సాటి మనుషులు బాధలో ఉన్నపుడు మేము సైతం మీకు అండగా ఉంటామని ముందుకు వచ్చి సహాయం చేయడం వారిలోని మానవత్వానికి నిదర్శనమన్నారు. యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఆర్ సురేష్, కరాటే ఇన్‌స్పెక్టర్లను, కరాటే విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఎమ్మెల్యే షాజహాన్ బాషా అభినందించారు. యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఆర్.సురేష్ మాట్లాడుతూ బాధితులను ఆదుకోవడానికి తనవంతు సాయం చేద్దామని ఇచ్చిన పిలుపుకు కరాటే విద్యార్థులు ముందుకు వచ్చి రూ.22,250 ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ మొత్తాన్ని సిఎం రిలీఫ్ ఫండ్‌కు డిడి రూపంలో ఎమ్మెల్యే షాజహాన్ భాషాకు అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కరాటే బ్లాక్ బెట్స్ టీ.మహేశ్వర్, ఎస్.మొహమ్మద్ ఐమాన్, ఎస్.మోహిబుల్ రెహ్మాన్, ఎస్.కాలేషా, మస్తాన్, ఎస్.మహమ్మద్ ఉమర్, కరాటే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వసతి గృహాలను పరిశీలిస్తున్న డిఎంఒ వేణుగోపాల్

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం: సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తి పిహెచ్‌సిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, పిహెచ్‌సి పరిధిలోని నాయునివారిపల్లిలో నిర్వహిస్తున్న లార్వా సర్వేను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉంచుకున్న డ్రమ్ములు, బకెట్స్ వంటి వాటిని పరిశీలించి లార్వాలను గుర్తించారు. ప్రజలకు లార్వా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఫ్రైడే డ్రైగా పాటించాలని సూచించారు. అనంతరం చింతపర్తి గ్రామంలో ఉన్న బిసి, ఎస్‌సి బాలుర వసతి గృహాలను తనిఖీ చేశారు. విద్యార్థులు ఉండే గదులను, వంట గదులను పరిశీలించారు. గదుల్లో ఉన్న కిటికీలకు మెష్ అక్కడక్కడ రంధ్రాలు పడి ఉండటాన్ని గుర్తిస్తూ ఈ రంధ్రాల ద్వారా దోమలు గదుల్లోకి చేరి విద్యార్థులకు కుట్టడం వల్ల జ్వరాలు వచ్చే అవకాశం ఉందని వార్డెన్‌కు చూపించి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. వంట మనుషులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సనా అయేషా, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సబ్ యూనిట్ అధికారి ముజీబ్, సూపర్‌వైజర్ సుధాకర్, హాస్టల్ వార్డెన్ రవీంద్ర, ఎఎన్ఎం హృదఈస్వరి పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ఆర్‌డి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-మదనపల్లి

రాయలసీమ మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ విశ్వనాథ్ గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆకస్మింగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగి ప్రభాకర్ హైకోర్టును ఆశ్రయించి తనకు ఉద్యోగంలో చేరినప్పటినుంచి సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుని పెన్షన్ ఇవ్వాలని కోరడంతో దానిపై విచారణ నిమిత్తం వచ్చానన్నారు. ప్రభాకర్ అనే ఉద్యోగి1986 సంవత్సరం ఎన్ఎంఆర్ కింద జాయిన్ అయ్యాడని ఐతే1992లో ట్రిబ్యునల్ తీర్పుతో పర్మనెంట్ చెసారని 2014లో పదవీ విరమణ చేసిన తన సర్వీసు రికార్డులు ఉన్నతాధికారులకు తెల్పలేదని ఇందుకు ప్రస్తుతం వస్తున్న పెన్సన్ తక్కువగా ఉండ డంతో తనకు న్యాయం చేయాలని సంబంధిత ఉద్యోగి గురించి, అప్పుడు పనిచేస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి, ప్రస్తుత కమిషనర్ ప్రమీలను విచారించడం జరిగిందన్నారు. ఇది సారణ తనిఖీలో బాగమేనన్నారు.

విచారణ చేస్తున్న ఆర్‌డి విశ్వనాథ్

బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- రాస్తారోకోలో సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి. హెచ్.చంద్రశేఖర్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ళ మణి అన్నారు. గురువారం టోల్‌గేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని, ప్రయివేటు, మండీలను, దళారులను రద్దు చేయాలన్నారు. మార్కెట్ యార్డ్ కమిషనర్, జాయింట్ కలెక్టర్ స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కనీస ధర కిలో రూ.25లతో కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలోని పీలేరులో కిలో రూ.25, అనంతపురం జిల్లా కేంద్రలో రూ.25లతో కొనుగోలు చేస్తున్నారన్నారు. దళారులు టన్నుకు 100 కిలోలు తగ్గిస్తున్నారని తెలిపారు. రైతులకు విత్తనాలు కల్తీ మోసం చేస్తున్నారని, చెట్టు రూ.12లతో కొనుగోలు చేసి, ఏడాది పొడవునా సాగు చేసి అప్పులకు వడ్డీలు, కట్టుకోలేక పెట్టిన పెట్టుబడి రాక, రైతులు ఇబ్బందులు పడుతున్నారని నూతన ప్రభుత్వం వందరోజుల ఉత్సవాలు జరుపుకుంటున్నారని రైతులకు గురించి పట్టదా అని ప్రశ్నించారు. అన్ని గ్రామాలలో రైతు సంఘం ఏర్పాటు చేసి, రైతుల హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి, పి.జాన్ ప్రసాద్, ఉపాధ్యక్షులు లింగాల యానాదయ్య, బండ రాజశేఖర్, సహాయ కార్యదర్శి, నగిరిపాటి ఆనంద్, వ్యవసాయ కార్మిక సంఘ మండల నాయకులు బొజ్జ శివయ్య, బొప్పాయి రైతు సంఘ నాయకులు, పి.రమణయ్య, ఏదోటి, ఆదినారాయణ, డి.పెద్ద వెంకటరామయ్య, ఎన్.కృష్ణారెడ్డి, ఎన్.మల్లికార్జున్‌రెడ్డి, ఎన్.నరసింహారెడ్డి, షేక్ కాసిం, ప్రేమ్ కుమార్, నవీన్ కుమార్, శ్రీను, జాకీర్, ఖాదరవల్లి, లక్ష్మి,నారాయణ, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

రాస్తారోకోలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి : సిఐటియు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, కంటింజెంట్, డైలీ వెజ్, ఎన్ఎంఆర్, పార్ట్ టైం, గెస్ట్, పీస్ రేట్ తదితర నాన్ పర్మినెంట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న నిర్వహించ తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ కోరారు. గురువారం మన్నూరు జడ్‌పి ఉన్నత పాఠశాల వద్ద చలో కలెక్టరేట్ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్, ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 2008 నుండి మొదలైన మినిమం టైం స్కేలుకు పిలోదకాలిస్తూ గతంలోనే తెలుగుదేశం ప్రభుత్వం జిఒ నెంబర్ 151 విడుదల చేసిందని, తర్వాత అధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వం కూడా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం స్కెల్ కన్నా నెలకు రూ.5 వేలు నుండి రూ.13 వేలు వరకు తగ్గించి జిఒ 7ను విడుదల చేసి అన్యాయం చేసిందన్నారు. ఇచ్చిన హామీల ప్రకారం వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఆరోగ్య బీమా అమలు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష తదితర పై అన్ని ప్రభుత్వ పథకాలు లోని ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీపాలసీ అమలు చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా గ్రాస్ శాలరీ చెల్లించాలని, ప్రతినెల మొదటి వారంలో జీతాలు చెల్లించాలని, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, ఉపాధ్యక్షులు డి.లక్ష్మీదేవి, కొండయ్య, గంగయ్య, భారతి, సుబ్బమ్మ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో లక్ష్యాలు అధిగమించాలి : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల్లో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జెసి ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని మండలాల ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, డిఆర్‌డిఎ, నీటి పారుదల, జిఎస్ డబ్ల్యూఎస్, హౌసింగ్ ఎఇలతో ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ, మండల ప్రత్యేకాధికారులు అన్ని మండలాలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల ప్రక్రియపై ఎప్పటికప్పుడూ సమీక్ష నిర్వహించి పురోగతిని తీసుకురావాలన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల ప్రక్రియలో ఈ సంవత్సరం డిసెంబర్ 31 నాటికి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు అందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు , ఎంపిడిఒలు ఈ పథకంపై ప్రత్యేక శ్రద్ధ చూపి, మంచి పురోగతి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 28న జరగబోయే 'మన ఇల్లు - మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పెద్ద లేఅవుట్‌లకు కేటాయించిన ప్రత్యేక అధికారులు ప్రత్యేక అధికారులు, హౌసింగ్ శాఖ అధికారులు లబ్ధిదారులందరికీ అవగాహన కల్పించి ఇల్లు కట్టుకునేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ నైదియా దేవి, హౌసింగ్ శాఖ పీడీ శివయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

విద్యుత్ ఎఇగా రాజశేఖర్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం మండల ట్రాన్స్‌కో ఇఒగా రాజశేఖర్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. చౌడేపల్లి ఏఈగా పనిచేస్తున్న రాజశేఖర్ బదిలీపై వాల్మీకిపురంకు వచ్చారు. ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జాకీర్ తిరిగి సబ్ ఇంజనీర్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈ రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలోని రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండి, వారి నుంచి వచ్చే సమస్యలను తక్షణం పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. రైతులు, ప్రజలు విద్యుత్ సమస్యలపై నేరుగా కార్యాలయంలో సంప్రదించి పరిష్కరించుకోవచ్చునన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు అక్షయ ఎంపిక

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : గురువారం కడప నగరంలోని మునిసిపల్ స్టేడియంలో జరిగిన ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో రాజంపేట ఏకలవ్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారిణి డి.అక్షయ రాష్ట్ర స్థాయి తేక్వాండో పోటీలకు ఎంపికైనట్లు మాస్టర్లు రెడ్డి ప్రవీణ్, యు.బాలాజీ గణేష్ తెలిపారు. అండర్-17 విభాగంలో ప్రతిభ చూపి ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా అకాడమీ కోచ్‌లు, సీనియర్ మాస్టర్ సునీల్ అక్షయకు అభినందనలు తెలియజేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-వాల్మీకిపురం : పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని వాల్మీకిపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ భారతి అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలలో భాగంగా పిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం ప్రతి రోజు తీసుకునే ఆహారంలో ఐరన్‌తో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అరుంధతి, రోహిణి కుమారి, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ భారతి

ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు సన్మానం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ప్రజలు మెచ్చిన నాయకుడు ఎమ్మెల్యే షాజహాన్ బాషా అని టిడిపి నాయకులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి కితాబిచ్చారు. గురువారం 20వ వార్డులో కౌన్సిలర్ తులసి, సీనియర్ నాయకులు రామకృష్ణ ఆచారిల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సమాజసేవ కార్యక్రమాల్లో ఇప్పటికే పేరు ప్రఖ్యాతులు గడించిన మీలాంటి వారి సేవలు పార్టీకి ఎంతో అవసరమని కోరారు. భాస్కరాచారి మాట్లాడుతూ నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పనిచేసే నాయకుడు ఎమ్మెల్యే షాజహాన్ బాషా అని, ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గ మరింత అభివృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలతో పాటు, ఇతర కార్యక్రమాలను ప్రజలకు విస్త ృతంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. సిటిఎంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రజా సమస్యలను అర్జీ రూపంలో తీసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అక్కడి రైతులకు ఎమ్మెల్యే ఉలవలను పంచి పెట్టారు. ఈ సందర్భంగా సిటిఎంలోని నాయకులు, ప్రజలు ఎమ్మెల్యేను ఘన సత్కారం చేశారు.

మున్సిపల్ కమిషనర్‌గా నాగేశ్వరరావు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మున్సిపల్ కమిషనర్‌గా బి.నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ రాంబాబు మెడికల్ లీవ్‌పై వెళ్లడంతో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావును కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పలుచోట్ల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అనుభవంతో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారుల సహకారంతో రాజంపేట పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా నాగేశ్వరరావు తెలియజేశారు. కార్యాలయ సిబ్బంది పూలమాల, శాలువాతో కమిషనర్‌కు అభినందనలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న నాగేశ్వరరావు

గ్రామస్తులకు చెక్కును అందిస్తున్న రూపానందరెడ్డి

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని చెన్నంపల్లి పంచాయతీ లింగారెడ్డిపల్లి అరుంధతీవాడలో నిర్మిస్తున్న మాతమ్మ ఆలయ నిర్మాణానికి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కారూపానందరెడ్డి లక్ష రూపాయలు విరాళంగా అందించారు. గురువారం గ్రామస్తులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రూపానందరెడ్డి దేవాలయాల నిర్మాణ కోసం తమ దాతృత్వాన్ని చాటుకోవడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో లింగారెడ్డిపల్లె గ్రామ ప్రజలు ఇంది ఆర్ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లె అరుంధతీవాడకు చెందిన గన్నేరు సుబ్బరాయుడు కుమారుడు వెంకటేశ్వర్ (చంటి) మంగళవారం రామక్కపల్లె దగ్గర ద్విచక్ర వాహనంపై వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న టాటా ఏస్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందడం తెలిసిన విషయమే. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ రొంపిచర్ల మురళి బాధిత కుటుంబాన్ని పరామర్శించి 20వేల రూపాయలను ఆర్థిక సహాయంగా కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది. అనంతరం మాజీ సర్పంచ్ మాట్లాడుతూ చంటి కుటుంబానికి ఎల్లవేళలా అండదండగా ఉంటామని తెలియజేశారు. ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా చేయడానికి ముందుంటామని తెలిపారు. చంటి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రజలకు సేవ చేయడంలో పగలు రాత్రి తేడా లేకుండా కుల మత అనే భేదాలకు తావు లేకుండా నిరంతరాయంగా 24 గంటలు ప్రజలకు సేవ చేయ డానికి ముందుంటామని పేర్కొన్నారు. చంటి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బస్టాండ్‌లో కుక్కలను ట్రాక్టర్‌లో ఎక్కిస్తున్న సిబ్బంది

కుక్కల బెడద నుంచి విముక్తి

ప్రజాశక్తి - గాలివీడు

పట్టణంలో కుక్కల బెడదతో భయాందోళనకు గురవుతున్నామని ప్రజలు ఇటీవల తహ శీల్దార్‌కు ఫిర్యాదుచేశారు. సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి తిరుపతి నుంచి ఆరుగురిని కుక్కలు పట్టడానికి తీసుకొచ్చారు. గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు పట్టణంలో కుక్కల సంచారం లేకుండా చూస్తామని తెలిపారు.గురువారం 60 కుక్కలను పట్టుకొని ట్రా క్టర్లలో ఎక్కించుకొని దూర ప్రాంతాల్లో వదిలిపెట్టినట్లు తెలిపారు. శుక్రవారం కూడా ప్రతి వీధిలో ఉన్న కుక్కను కూడా తీసుకెళ్తామని చెప్పారు. ప్రజలకు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వీధుల్లో సంచరిస్తున్న కుక్కలను లేకుండా చూస్తామని చెప్పారు. కుక్కల బెడదతో ఆందోళన చెందుతున్నామని పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకొని కుక్కలు లేకుండా చేయడం సంతోషమన్నారు.

ప్లేట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్, వైస్ ఎంపిపి

ప్రతి ఒక్కరూ దానగుణం కలిగి ఉండాలి

ప్రజాశక్తి-గాలివీడు

ప్రతి వ్యక్తి చిన్ననాటి నుంచే దానం చేసే హృదయం కలిగి ఉండాలని గాలివీడు సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి పేర్కొన్నారు. గురువారం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ప్రధానోపాధ్యాయుడు మొహిద్దిన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి విద్యార్థిని సమాజానికి మేలు చేసే విధంగా క్రమశిక్షణ, మంచి ప్రవర్తనతో మెలగాలని అన్నారు. పాఠశాలకు ప్లేట్లు పంపిణీ చేసిన ఉపాధ్యాయుడు బుక్కపట్నం సుబ్బరాయుడు అభినందించారు. వైస్ ఎంపిపి మిట్టపల్లి యధుభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో కూడా ప్రతి సంవత్సరం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజు కూడా అతడే చెల్లించే గొప్ప గుణమున్న వ్యక్తని అభినందించారు. గాళ్ళపల్లి పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులకు 40 ప్లేట్లు, గాలివీడు బాలుడు ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులు 15 మందికి ప్లేట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఇటువంటి ఉత్తమ ఉపాధ్యాయుడి సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో ఇష్టంగా కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ1 పిల్లి నాగరాజు , ఎంఇఒ2 శ్రీనివాసులు, ఉపాధ్యాయులు నరేంద్ర, గౌస్‌నుద్దీన్, బైరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మన ఇళ్లు.. మన గౌరవం'ను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మన ఇళ్లు..మన గౌరవం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపిడిఒ ఉపేంద్రరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 28 ఉదయం 9 గంటలకు కంకర లేఅవుట్, ఎపిఐఐసి-1 లేఅవుట్‌లో వేర్వేరుగా గృహ లబ్దిదారులతో సమావేశం నిర్వహించనున్నామని అన్నారు. ఇళ్ల నిర్మాణాలు మార్చి నెలాఖరుకు పూర్తిచేసుకునేలా లబ్దిదారులకు అవగాహన కల్పించి, నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో పీలేరు మండలం ప్రత్యేకాధికారిణి ప్రసన్నకుమారి, హౌసింగ్ డిఇ గోపాల్ నాయక్, హౌసింగ్ ప్రత్యేకాధికారులు దయాకర్ రెడ్డి, సూరిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉపేంద్రరెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలో సంక్షోభ పరిస్థితుల్లోనూ ప్రజలకు సంక్షేమ పథకాలను చట్టబద్ధంగా అందిస్తున్నం ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గంలోని కెవిపల్లి మండలం, గర్నిమిట్టలోఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధిలో భాగంగా కొన్ని పనులు మంజూరు య్యాయని, ఇతర అభివృద్ధి పనుల కోసం అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో ఎవరు అక్రమాలకు పాల్పడినా క్షమించేది లేదని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సామా జిక పింఛన్లను పెంచి లబ్ధిదారులకు అందిస్తూ, నిరుద్యోగ ఉపాధ్యాయుల కోసం మెగా డిఎస్‌సి పై చేశారని అన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా ప్రజల ఆకలి తీర్చడం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడం, దొంగల్లా అరాచకాలను నియంత్రించి శాంతి భద్రతల పరిరక్షణ, గంజాయి రహిత సమాజ స్థాపన, భూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని ప్రజలకు మంచి చేస్తుంటే వైసిపి నాయకులు ఓర్వలేకపో తున్నారని టిడిపి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక బడికాయల పల్లిలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఏకైక వ్యక్తి వంద రోజుల్లోనే అభివృద్ధి చూపించినటువంటి వ్యక్తి సిఎం చంద్రబాబు అని కొనియాడారు. అవ్వతాతలకు పింఛన్ పెంపుదల, మెగా డిఎస్‌సి, అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శంకరయ్య, ఎంఇఒ రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

పీలేరు :సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి

రైల్వేకోడూరు : రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలబెడతామని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని రాజు కన్వెన్షన్ లో కూటమి పార్టీ నాయకులు,అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూపానంద రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను ఇప్పటికే ప్రారంభించామని అన్నారు. పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో సిసి రోడ్లు, డ్రైనేజీలు,కల్వర్టుల నిర్మాణానికి వేగంగా నిధులు మంజూరు అవుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ మాట్లాడుతూ టిడిపి ఇన్‌ఛార్జి రూపానందరెడ్డితో కలిసి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జాషువా, కూటమి నాయకులు ముక్కా సాయివికాస్ రెడ్డి, కట్టా గుండయ్యనాయుడు, తాతంశెట్టి నాగేంద్ర, సర్పంచులు శివయ్య, సంయుక్త, కమతం నాగరాజు, కట్టా బాలాజీ, బాబాసాహెబ్, ఎన్‌ఎస్‌ఆర్, జోగినేని మణి,కొమ్మ శివ,కల్లా చలపతి, తిరుపాలు, బాబు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- మండల ప్రత్యేక అధికారి జె.మునిరాజుకుమార్

గృహనిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి మునిరాజుకుమార్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు మండల ప్రత్యేక అధికారి జె.మునిరాజుకుమార్ సూచించారు. గురువారం పెద్దతిప్పస ముద్రం మండలంలోని పిటిఎం, విసనకర్రవాండ్లపల్లి లేఅవుట్‌లలో గృహ నిర్మాణ పనులను హౌసింగ్ ఇంజినీర్ శ్రీనివాసులు, లేఅవుట్ స్పెషల్ ఆఫీసర్ ఉపాధి హామీ ఎపిఒ తిరుపాల్, ఎంపిడిఒ బాలాజీ, పంచాయతీ విస్తరణ అధికారి యోగా నంద, పంచాయతీ కార్యదర్శులు బాషా, శివ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలిసి పరిశీలిం చారు. అధికారులు, సచివాలయ సిబ్బంది గృహ నిర్మాణ లబ్ధిదారులతో ఎప్పటి కప్పుడు మాట్లాడి, గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి కృషి చేయాలని అన్నారు. సకాలంలో లబ్ధిదారులకు బిల్లులు మంజూరు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో గృహాలను నిర్మించుకుని లబ్ధిదారులు తమ సొంత ఇంటి కలలను సహకారం చేసుకోవాలని సూచించారు.

కస్తూర్బా పాఠశాలలో తనిఖీ

పెద్దతిప్పసముద్రం మండల ప్రత్యేక అధికారిగా జె.మునిరాజుకుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. పంచాయతీరాజ్ డిఇగా పనిచేస్తున్న ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. గతంలో ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహించిన విజయ్‌మోహన్ డిఇ బదిలీ అయ్యారు.విధుల్లో చేరిన తొలిరోజే మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.245 విద్యార్థులకు గాను 227 విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్న భోజనాన్ని, పాఠశాల పరిస రాలను, మౌలిక వసతులు కల్పనను, పరిశీలించారు. నూతన మండల ప్రత్యేక అధికారికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాలాజీ, పంచాయతీ విస్తరణ అధికారి యోగానంద, పాఠశాల ప్రిన్సిపల్ శైలజ శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత : ఎల్‌డిఎం

ప్రజాశక్తి-రాయచోటి

ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఎల్ డిఎం ఆంజినేయులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలో లోని పాత రాయచోటిలో మున్సిపల్ కార్మికులకు విఐడిఎస్ ఎన్ జిఒ రాయచోటి సెంటర్ వారు సఫాయి మిత్ర సూక్ష్మ క్యాంప్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటిస్తూ తన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మేనేజర్ సతీష్‌బాబు మాట్లాడుతూ సామాజిక భద్రత పథకాలు ప్రధాన మంత్రి సురక్ష యోజన పథకం, జీవన జ్యోతి యోజన పథకము, అటల్ పెన్షన్‌యోజన, సుకన్య సమృద్ధియోజనా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మదనపల్లి : అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు 'స్వచ్ఛత హీసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల కలశాలలోని చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యకమం లో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి.కమల్ బాషా మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి మరింత ఊపునిస్తూ 'స్వచ్ఛత హీసేవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛత ఉద్యమంలో భాగం పంచుకోవాలని అన్నారు. ప్రతి గ్రామం, వీధి, పట్టణం, పరిసరాలు అంతటా స్వచ్ఛతను పాటించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పరిసరాల శుభ్రత లేకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉండటం సాధ్యం కాదని, స్వచ్ఛ భారత్ ఉద్యమాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లడం ద్వారా రోగాల వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మసాపేటలోని సుగవాసి రాజారాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లను పెంచడం వల్ల మానవులు వదిలే చెడు కార్బన్ డై ఆక్సైడ్ చెట్లు పీల్చుకొని స్వచ్ఛమైన ఆక్సిజన్ అందిస్తుందని అన్నారు. అనంతరం మొక్కలు నాటి పర్యావరణం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు జి.మనోజ్ కుమార్, సెక్రటరీ ఆర్ శశిశేఖర్, ట్రెజరర్ ఎన్.రాజు, రోటరీ క్లబ్ జిల్లా నాయకులు పి.సురేష్ కుమార్, జోషి, అర్షఫ్‌అలీ, డాక్టర్ రెడ్డన్న, సభ్యులు రూపేష్, నరసింహ, పాఠశాల ప్రధానోఉపాధ్యాయులు శివకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మదనపల్లి :మిట్స్‌లో ఏరివేసిన చెత్తను చూపుతున్న విద్యార్థులు

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో..

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీసేవ కార్యక్రమాన్ని ఒంటిమిట్టపల్లెలో నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల చుట్టు పక్కల చెత్తను శుభ్రం చేశారన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి తద్వా రా రోగాల బారిన పడకుండా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అరుణ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు ఈశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి :** పరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా స్వచ్ఛత హి సేవా కింద ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎన్‌హెచ్ ఎఐ చైర్మన్ ఎస్‌పిఎస్ జైన్ తెలిపారు. స్వచ్ఛత హి సేవా ర్యాలీ సందర్భంగా కలికిరి జంక్షన్ టోల్ ప్లాజా ప్రాంతాల్లో కరపత్రాల పంపిణీ చేశారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టి. బిస్సెగౌడ సభ్యుడు, రాజేంద్రకుమార్ గుప్తా సభ్యుడు, జి. వెంక టేశ్వర్లు ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎ.వి. నాగేంద్ర బాబు టీమ్ లీడర్, ఎం.ఇందిరా ప్రియదర్శిని రెసిడెంట్ ఇంజి నీర్, బీలా వెంకట, భాస్కర, పట్టాభి రామయ్య, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్, భగవాన్‌సింగ్ పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్ క్రీడల్లో సత్తా చాటుతున్న విద్యార్థులు

రైల్వేకోడూరు: ప్రతిభ చాటిన విద్యార్థులతో కరస్పాండెంట్ సుకుమార్‌రెడ్డి

ప్రతిభ చాటిన డాల్ఫిన్ డేల్ విద్యార్థులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలలో డాల్ఫిన్ డేల్ హైస్కూల్ విద్యా ర్థులు సత్తా చాటారని కరస్పాండెంట్ పంజం సుకుమార్‌రెడ్డి తెలిపారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబులవారిపల్లె మండలం సంజీవపురం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన ఆటల పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో ఎం.శ్వేత, వి.హాసిని, అండర్ -7 బాలుర విభాగంలో పి.దీక్షిత్, ఎస్. కార్తీక్ ప్రతిభ చూపారని చెప్పారు. అండర్-14 బాలికల చెస్ విభా గంలో ఎస్.సం హిత, వి.యజ్ఞ, అండర్-14 బాలుర విభాగంలో అథ్లెటిక్స్‌లో ఏ అభిషేక్‌రెడ్డి విజేతలుగా నిలిచారని అన్నారు. విజయం సాధించిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారని, క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు వ్యాయామ ఉపాధ్యాయులు మనోజ్‌ను, విద్యార్థు లను అభినం దించారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు బాలకుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు సుండుపల్లె విద్యార్థులు

ప్రజాశక్తి-సుండుపల్లె

మండల కేంద్రమైన సుండుపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు ఎస్‌జి ఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు పీడీ రాధారాణి తెలిపారు.కడప జిల్లాలోని గండి గురుకుల పాఠశాలలో జరిగిన ఎస్‌జి ఎఫ్ అండర్-14, అండర్-17 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల కోసం ఉమ్మడి కడప జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించారు. సుండుపల్లె ఉన్నత పాఠశాల నుంచి అండర్-17 బాలికల విభాగంలో ఎం.వాణి, అండర్ -14విభాగంలో సి.గగన, అల్ఫిష, అఫీఫా, నవ్యల త తమ ప్రతిభ చాటారని అన్నారు. అండర్-17, అండర్-14 విభాగాల సెలెక్టర్లు ఐదుగురు బాలికలను ఉమ్మడి కడపజిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు ప్రకటించారని పీడీ రాధారాణి తెలిపారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు జయన్న, ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు విద్యార్థులను అభినందించారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి క్రీడా పోటీలు

పుల్లంపేట : మండల పరిధిలోని ఎపి మోడల్ స్కూల్‌లో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, పీడీ పి.నీలకంఠరావు తెలిపారు. ఈ స్కూల్ గేమ్స్‌లో క్రికెట్, సాఫ్ట్ బాల్, బేస్ బాల్ అండర్-19 బాల బాలికలు ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగ తిరుమలరావు పాల్గొన్నారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో కడప జిల్లా నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు పీడీలు తెలిపారు. ప్రతి క్రీడాకా రుడు కూడా స్కూల్ స్థాయి నుంచి మండల స్థాయి, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి, జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి, రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదిగే విధంగా క్రీడాకారులు ప్రతినిత్యం సాధన చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ అండర్-19 సెక్రటరీ శారద, అథ్లెటిక్ సెక్రట రీ విజయ ప్రసాద్‌రెడ్డి, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ సుబ్బ రాజు, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ కోడూర్ పీడీ లు చంద్రమోహన్ రాజు, అరుణ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు కొత్తపేట విద్యార్థులు

మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపేట నందు విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు రైల్వేకోడూరులో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి నందు క్రీడా పోటీల్లో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచారు. పదిమంది క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రధా నోపాధ్యాయులు మల్లికార్జున, పీడీ బాలశేఖర్ తెలిపారు. వాలీబాల్, యోగా, బాడ్మింటన్, చెస్‌క్రీడల్లో విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. వాలీబాల్ విభాగంలో లోకేష్, ఓంకార్, చెస్ విభాగంలో అమర్ బాషా, యోగ విభాగంలో ప్రశాంత్ నాయక్, గంగ, చంగరెడ్డి, సాగర్ సందీప్, బాలికలు బ్యాడ్మింటన్‌లో తులసి, జ్యోత్స్నజిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

విద్యార్థినికి నగదు బహుమతి అందిస్తున్న సుబ్బరాయుడు దంపతులు

ప్రతి ఏడాది ఉత్తమ విద్యార్థికి నగదు బహుమతి

ప్రజాశక్తి-పుల్లంపేట

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుడారు సీతమ్మ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ సుబ్బరాయుడు నాయుడు పేర్కొన్నారు. బుధవారం బి.కమ్మపల్లి జడ్‌పి హైస్కూల్‌లో గత ఏడాది పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన బి.కమ్మపల్లి, ఓబులవారిపల్లె జడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందించారు. వై.అమృత వర్షిణి రూ.2వేలు, ఎ.అఖిల రూ.1500, మం.మధులత రూ.1000 చొప్పున అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే తాను చదివి బి.కమ్మపల్లె నుంచి ఉన్నత శిఖరాలకు చేరుకున్నానని అన్నారు. తన తల్లి గుడారు సీతమ్మ పేరుతో ఒక ట్రస్ట్ ను స్థాపించి అనేక సేవ కార్యక్రమాలు చేస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని అన్నారు. వచ్చే పబ్లిక్ పరీక్షల్లో కూడా మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అంద స్తానని చెప్పారు. విశ్రాంత ఉపాధ్యాయులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అబ్బిగారి వేణుగోపాల్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.బబితా, ఉపాధ్యాయులు రమణారెడ్డి, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, బాలనరసింహులు, ఆసిఫ్‌బాషా, రమణయ్య, ప్రమీల, పాఠశాల కమిటీ చైర్మన్ పి.నాగేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు క్వార్టర్స్ స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయం సమీపంలో పోలీసు క్వార్టర్స్‌కు సంబంధించిన స్థలాన్ని గురువారం ఎస్‌ఐ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నల్లగుట్టపల్లి గ్రామం పొలంలో సర్వేనెంబర్ 593/1లో 0.64 సెంట్ల స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. పోలీసులకు కేటాయించిన స్థలానికి కొందరు ఇటీవల ఆక్రమణ గురి చేస్తున్నారని తెలిసి తమకు కేటాయించిన స్థలంలో పెరిగిన కంపచెట్లు, పిచ్చి మొక్కలు తొలగించి హద్దులను ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు. త్వరలో నిధులు మంజూరు అయితే ఆ స్థలంలో క్వాటర్స్‌ను నిర్మించుకుంటామని పేర్కొన్నారు.
పోలీసు క్వాటర్స్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాలపై చర్యలు

-తహశీల్దార్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుర్రంకొండ

ఇందిరమ్మ కాలనీలో బోగస్ పట్టాలపై నిర్మించిన నిర్మాణాలను నేల మట్టం చేస్తామని, బోగస్ పట్టాలను వెలికి తీసి చట్టపరమైన చర్యలు చేపడతామని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఇందిరమ్మ కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణంలో పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో కొత్తగా ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా, కొత్తగా బంకులు ఏర్పాటుచేసినా, కొత్త పట్టాలు పుచ్చుకొని ఇతర ఏ కార్యక్రమాలు తీసుకున్న కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. 2021లో అప్పటి మదనపల్లి సబ్ కలెక్టర్ జాహ్నవి ఇందిరమ్మ కాలనీ తనిఖీ చేసి అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చివేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

ఇందిరమ్మ కాలనీలో బంకు ఏర్పాటు చేసిన వారితో మాట్లాడుతున్న తహశీల్దార్

క్రైం కార్నర్

10 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటుసారా విక్రయస్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. గురువారం మధ్యాహ్నం ముష్టూరు పంచాయతీ ఎర్రప్పగారిపల్లె సమీపంలో అదే గ్రామానికి చెందిన పోతురాజు రెడ్డిరాజు నాటుసారా తీసుకొచ్చి విక్రయిస్తుండగా పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి అతనిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటు సారా విక్రయిస్తూ పట్టు బడ్డ వ్యక్తి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠినమైన చర్యలు తీసు కుంటామని ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని కొర్లకుంట గ్రామ పంచాయతీ రైల్వే బ్రిడ్జికి దగ్గరలో ఎర్రమడుగు వాగు దగ్గర ముళ్ళ పొదల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్‌ఐ రమేష్‌నాయుడు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని తెలిపారు.

అదుపు తప్పి మినీ లారీ బోల్తా

ప్రజాశక్తి-నందలూరు

కడప చెన్నై జాతీయ రహదారిలోని ఆల్విన్ మౌంట్ కార్మెల్ స్కూల్ వద్ద గురువారం కడప నుంచి రాజంపేటకు ఎరువులోడుతో వెళ్తున్న మినీ లారీ వెనుక టైర్ పగలడంతో అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఆ సమయంలో ఎదురుగా ఏ వాహనం రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ జిలానీ బాషాకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ప్రజాశక్తి-పీలేరు

అనుమానస్పద స్థితిలో వివాహిత చెరువులో పడి మృతి చెందిన సంఘటన పీలేరు మండలంలో చోటు చేసుకుంది. పీలేరు అర్బన్ ఎస్‌ఐలు బాలకృష్ణ, లోకేష్ ల కథనం మేరకు వివరాలు .. గురువారం మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీ, మొరవవడ్డిపల్లె చెరువులో ఓ మహిళ మృతదేహం నీటిపై తేలాడుతున్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పీలేరు అగ్నిమాపక సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, పారిశుధ్య కార్మికుల సాయంతో మృతదేహాన్ని నీటిలోంచి వెలికి తీశారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండడంతో మహిళ ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో ఆరా తీశారు. మృతురాలు స్థానికంగా ఇటుకల బట్టీలో పని చేసే తమిళనాడుకు చెందిన మణి భార్య సాయిసుధ (25)గా గుర్తించారు. గత మంగళవారం భార్య, భర్త గొడవపడ్డారని, అప్పటినుంచి సాయిసుధ కనబడలేదని మృతురాలి భర్త మణి చెప్పాడు. మృతురాలికి స్నేహ, కృష్ణదేవ అనే ఇద్దరు పిల్లలున్నారు. సాయిసుధ నడుముకు రాయి కట్టుకుని నీటిలో దూకి ఆత్మహత్య చేసుకుందా. లేక ఎవరైన హత్య చేసి రాయి కట్టి చెరువులో పడేశారా, అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.